www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 నవంబర్ 2023



కాపవరంలో యుపి స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కాపవరంలో పాఠశాలను యుపి స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఈ పాఠశాలను ఎంపిపి అంబటి భవాని గురువారం ప్రారంభించారు. సర్పంచ్ యనమదల మంగాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి మాట్లాడుతూ మంత్రి సహకారంతో ఈ స్కూలు అభివద్ధి చేశామన్నారు. పరిసర గ్రామాలైన కందులపాలెం, తాడిపల్లి, బావారం, సిరిపురం నుండి వచ్చే విద్యార్థులకు ఈ హైస్కూల్‌ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంపిటిసి సభ్యుడు అర్.సతీష్ మాట్లాడుతూ ఇక్కడికి వచ్చే విద్యార్థులకు ఉచితంగా సైకిల్ గ్రామస్థులు సహకారంతో ఇస్తామన్నారు. సమావేశంలో డివైఇఒ ఫణి, ఎంపిడిఒ కీర్తి స్పందన, స్కూల్ కమిటీ ఛైర్మన్ మత్తి లక్ష్మి మణి మాల, వెలంపాలెం ఎంపిటిసి సభ్యురాలు తుంబూరి సుబ్బలక్ష్మి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంఇఒ ఎం. శ్రీనివాసు, ఇఒపిఆర్‌డి సెలట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో సాగునీటి సరఫరా

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- జిల్లా నీటిపారుదల శాఖ వ్యవసాయ శాఖ సలహా మండళ్ల సంయుక్త సమావేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రి వేణు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-అమలాపురం

పూర్తి స్థాయిలో సాగునీటి సరఫరాచేస్తామని, అయితే నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ రైతు సంక్షేమమే ధ్యేయంగా డ్రైన్లలో క్రాస్ బండ్లు వేస్తూ లభించిన ప్రతి నీటి బొట్టును రబీలో సాగునీటి కొరకు వినియోగిస్తామని జిల్లా వెనుకబడిన తరగతులు, సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ మంత్రి సిహెచ్.శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా నీటిపారుదల క్షేత్రస్థాయి సలహా మండలి వ్యవసాయ శాఖ సలహా మండళ్ల సంయుక్త సమావేశం నిర్వహించారు. రబీ 2023-24 ఫసలీ- 1433 సాగునీరు విషయమై చర్చించి పలు నిర్ణ యాలు తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో లభించిన ప్రతి నీటి బొట్టును ఒక చక్కటి ప్రణాళిక ప్రకారం తక్కువ సాగునీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగును చేపట్టే రీతిలో నీటి విని యోగాన్ని గరిష్ట తరం చేయాలని సూచించారు. రైతులు ఖరీఫ్ పంట అనంతరం డిసెంబరు ఒకటో తేదీ నుంచి రబీ సీజన్ ను ప్రారంభించి నాట్లు వేయటల్లో ప్రక్రియను డిసెంబర్ నెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. జనవరి చివరి వారం నుండి ఎరువులను విధానం పై రైతులకు పూర్తి అవగాహనను పెంపొందించి సక్రమంగా సాగునీటిని సరఫరా చేయాలన్నారు. రబీ సీజన్‌ను మార్చి 31 నాటికి పూర్తి చేసే దిశగా రైతులను చైతన్యపరిచి తక్కువ కాలం పరిమితి గల వరి పంటలను రకాలను ప్రోత్సహించాలన్నారు. తదుపరి మూడో పంటకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో 2023-24 రబీ సీజన్లో సాగుకు అనుకూలమైన ఆయకట్టుగా ఉన్న 2,71,658 ఎకరాలను తీర్మానించామన్నారు. అధికారులు సమన్వయంతో చిట్టచివరి భూములకు సాగునీరు అందించాలని సాగునీరు ఏ ఒక్క ఎకరానికి అందలేదన్న మాట వినిపించకూడదన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్పటికీ కోనసీమ ప్రాంతంలో ధాన్యం దిగుబడి ఆశాజనకంగా ఉండి ఎకరాకు 38 బస్తాలు వరకు వస్తోందన్నారు. వెదజల్లే పద్ధతిలో రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు సాగునీటి వినియోగం తగ్గుతుం దన్నారు. సాగునీటి కొరత నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు నుంచి సాగునీటిని సరఫరా చేయాలని మూడు జిల్లాల నీటిపారుదల సలహా మండళ్లు ఏకగ్రీవంగా తీర్మానించాయని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ హి మాన్షు శుక్లా మాట్లాడుతూ గోదావరి నుండి సెంట్రల్ తూర్పు పశ్చిమ సమానంగా సాగునీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లా డుతూ రబీ సాగుకు 2,71,658 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించడం సంతోషమేనని అన్నారు. శాసన మండలి సభ్యులు ఐ.వి రావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించే విధానాలపై ప్రాక్టికల్గా అవగాహన పెంపొందించాలని సూచించారు. జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ జి శ్రీనివాసరావు నీటి లభ్యత సాగు విస్తీర్ణం గూర్చి వివరించగా జిల్లా వ్యవసాయ అధికారి ఎ బోసు బాబు రబీ సాగుకు సంబంధించి సన్నద్ద చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, వైసిపి రైతు విభాగపు సభ్యులు కె.త్రినాథ్ రెడ్డి, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణరావు, ఎంఎల్ఏ కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు రైతు సంఘ ప్రతినిధులు అధికారులు పాల్గొ న్నారు.

సహకార స్ఫూర్తిని పెంచేలా వారోత్సవాలు



మామిడికుదురులో సొసైటీ వారోత్సవాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ, ఛైర్ పర్సన్‌లు

ప్రజాశక్తి - మామిడికుదురు

రైతులతో సహకార స్ఫూర్తిని పెంచేలా వారోత్సవాలను వేదికగా తీసుకోవాలని రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు అన్నారు. మామిడికుదురు, నగరం ప్రాథమిక వ్యవసాయ సహకారపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వారోత్సవాలకు సర్పంచ్ గౌస్ మొహిద్దిన్ అధ్యక్షతన వహించారు. ఎంఎల్ఎ రాపాక మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం ముందుందన్నారు. సహకార పతాకాన్ని నగరం పిఎసిఎస్ ఛైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, ఎంఎల్ఎ రాపాక ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సూరిశెట్టి బాబి, నగరం, ఈదరాడ, పాశర్లపూడి, అప్పనపల్లి, పాశర్లపూడిలంక పిఎసిఎస్ ఛైర్‌పర్సన్‌లు కె. ఆదిత్య, బొలిశెట్టి భగవాన్, యువివి.సత్యనారాయణ, గెడ్డం కృష్ణమూర్తి, సిఇఒలు ఆర్‌కె.జనార్ధన్ రెడ్డి, సిహెచ్.రమేష్ బాబు, వై.ఏసురావు, జి.శ్రీరాములు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రోజా రమణి తదితరులు పాల్గొన్నారు. **మండపేట** సహకార సంఘాల ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని మండపేట పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ పెంకే గంగాధర్ అన్నారు. గురువారం స్థానిక మండపేట వల్లూరి అప్పారావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అవరణలో సొసైటీ 70వ అఖిలభారత సహకార వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సహకార సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎన్నో పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర, ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైతులు, సంఘ సీఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పూర్తి స్థాయిలో పథకాలు

సామాజిక సాధికార బస్సు యాత్రలో వైసిపి ప్రజాప్రతినిధులు



కొత్తపేటలో సభలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు తదితరులు

ప్రజాశక్తి-కొత్తపేట

సిఎం వైఎస్ జగన్ నాలుగు సంవత్సరాల 8 నెలల ప్రజా పాలనలో నూరు శాతం వివిధ వర్గాలకు సంక్షేమ అభివద్ధి పథకాలను పూర్తిస్థాయిలో అందించారని వైసిపి ప్రజాప్రతినిధులు అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో గురువారం సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కొత్తపేటలో ఎంఎల్ఎ జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు చెల్లిబోయిన వేణు గోపాలకష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ఎంపీ మార్గాని భరత్, చింతా అనురాధ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, తదితర అగ్ర నాయకులు పాల్గొన్నారు కొత్తపేట నియోజకవర్గంలో వివిధ వర్గాలకు అమలు చేసిన పథకాలను వివరించారు **రావులపాలెం** సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరిగి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్‌సి కుడుపూడి సూర్యనారాయణ, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కొత్తపేట బహిరంగ సభకు తరలివెళ్లారు.

గత పంట రవాణా చార్జీలు చెల్లించాలి : ఎంఎల్‌సి ఐవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం

గత పంట ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, ప్రైవేటు యజమానుల ట్రాక్టర్లకు సంబంధించి రాజోలు, మామిడికుదురు మండలాలలో రూ.20లక్షల రవాణా చార్జీలు ఇంతవరకు చెల్లించలేదని ఎంఎల్‌సి ఇళ్ళ వెంకటేశ్వరరావు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని రూ.లక్షలు బకాయిలు ఉన్నాయో తెలియజేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ తక్షణం బకాయిలు చెల్లించాలని సభ దృష్టికి తీసుకుచ్చారు. దీనిపై కలెక్టర్ ఈ సమస్య తన దష్టికి వచ్చినట్లు చెబుతూ త్వరలో చెల్లింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వెదజల్లు వ్యవసాయం ప్రోత్సహిస్తున్నట్లుగా నివేదికలో చెప్పారని అయితే జిల్లాలో ఎన్ని ఎకరాల్లో ఈ సేద్యం జరుగుతుందో చెప్పాలని ఎంఎల్‌సి ఐవి అన్నారు. దీని వల్ల వ్యవసాయ ఖర్చులు తగ్గితే, దిగుబడి మామూలుగా ఉంటే రైతుకు ఉపయోగకరంగా ఉంటే దీనిని ప్రోత్సహించవచ్చని ఎన్ని ఎకరాల్లో ఈ సేద్యం జరుగుతోందో చెప్పాలని అడిగారు. దీనికి అధికారులు సమాధానం చెప్పలేదు. రాబోయే 2023 - 24 దాళ్వా పంటకు సగం ఎరువులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు ఈ నివేదికలో చెప్పారని, పంట సమయానికి మిగిలినవి 62,955 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి వస్తాయా అని ఎంఎల్‌సి ఐవి ప్రశ్నించారు. గత సమావేశాల్లో అవుట్సోర్సింగ్ లో పనిచేస్తున్న లస్కర్లకు నెలల తరబడి జీతాలు పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటికీ ఎన్ని నెలల జీతాలు పెండింగ్లో ఉన్నాయో, ఎంత బడ్జెట్ బకాయి ఉందో చెప్పాలని ప్రశ్నించారు. రూ. పది, రూ.15 వేలు జీతం పొందే లస్కర్లను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రశ్నలకు సమా ధానం చెప్పకుండానే మంత్రి మాటలతో సమావేశం ముగించారు..

పలు కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

మండపేట, రాయవరం మండలంలలో ఇటీవలె పలువురు మరణించారు. మృతుల కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఏడిద సావరంలో మేడిశెట్టి కాంతం, రాయవరంలో కల్లెంపూడి అప్పారావు, మిరియాల బాలరాజు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట చిట్టూరి నాగవర ప్రసాద్, పాలకేంద్రం వీర్రాజు, కోట దుర్గారావు, మేడిశెట్టి లక్ష్మణ్, కోడి అబ్బు, కురుపూడి ఏసు, వుండవిల్లి రాంబాబు, నేతల సురేష్, బర్ల రాజు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-కొత్తపేట

కమ్మిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అలిబేగ్ జిల్లా ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్.టి.యూ భవన్ లో గురువారం అలిబేగ్ ను ఎస్.టి.యూ సభ్యులు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బాలకష్ణ,బండారు నారాయణ,కార్యదర్శులు ఆచంట ప్రసాద్,బండారు శ్రీను,సోమయాజులు రత్తాలు, శ్రీనివాస్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అందుకే పండగ మామూళ్లు ఇస్తున్నామయ్యా!! తప్పేముందీ..!!!

మూడు పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఏకగ్రీవం



ఉపసర్పంచ్ వెంకటరెడ్డి నాయుడును అభినందిస్తున్న దృశ్యం




చెముడులంకలో ఉప సర్పంచ్ చంటికి అభినందన సత్కారం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల గురువారం ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. వివరాలు ఇవి..

కొమరగిరిపట్నం ఉపసర్పంచ్‌గా వెంకటరెడ్డినాయుడు

అమలాపురం(అల్లవరం) కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా గుర్రం వెంకటరెడ్డి నాయుడు(శ్రీను) గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ రాపాక విజయలక్ష్మి అధ్యక్షతన ఆలమూరు పిఒఆర్‌డి, ప్రత్యేక అధికారి పిఆర్‌సి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశములో పంచాయతీ పాలకవర్గ సభ్యులు గుర్రం వెంకటరెడ్డి నాయుడు ను ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంలో జరిగిన జెంటిల్మెన్ ఒప్పందంలో భాగంగా ఈ ఉపసర్పంచ్‌ఎన్నిక అనివార్యమైంది. వెంకటరెడ్డి నాయుడుకు లక్ష్మణేశ్వర పిఎసిఎస్ అధ్యక్షులు అల్లూరి సురేష్ రాజు, ఎంపిటిసి సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కడలి లక్ష్మణ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొంతు సత్యనారాయణ, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం ఛైర్మన్ నామన బాల భాస్కర రావు అభినందనలు తెలిపారు.



చొప్పెల్లలో ఉప సర్పంచ్ దుర్గారావుకు అభినందన సత్కారం

చెముడులంక, చొప్పెళ్ల ఉపసర్పంచులుగా చంటి, దుర్గారావు

ఆలమూరు చెముడులంక, చొప్పెల్ల గ్రామాలకు సంబంధించి ముందుగా చేసుకొన్న పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లుఆ గ్రామ ఉపసర్పంచులుగా పదవి బాధ్యతలు నిర్వహించిన అడబాల వెంకటరావు, సుంకర కామరాజులు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఆ పదవులకు ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో మిగిలిన రెండున్నరేళ్లు ఉప సర్పంచులుగా బాధ్యతలు నిర్వహించేందుకు చెముడులంక గ్రామ వార్డు సభ్యుడైన దొండపాటి చంటి, చొప్పెల్ల వార్డు సభ్యుడైన తోరాటి దుర్గారావులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా పంచాయతీ కార్యాలయాల్లో వారిచేత ఎన్నికల అధికారులైన ఏఎస్ గౌరీ కుమారి, అడబాల శ్రీనివాసరావులు వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గ్రామ సర్పంచులు తమ్మన శ్రీనివాసు, దంగేటి చంద్రకళ బాపనయ్య, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతా మహాలక్ష్మి తదితరులు ఉప సర్పంచ్‌లకు అభినందనలు తెలిపారు.

పలు చోట్ల టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'



పసుపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల టిడిపి ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వివరాలు ఇవి.

అంబాజీపేట పసుపల్లిలో గురువారం టిడిపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకులు వక్కలంక బుల్లియ్య పాల్గొని ఇంటింటికి తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో చంద్రబాబుదే గెలుపని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిన్నం బాలవిజయరావు, రాష్ట్ర ఎంబిసి సభ్యులు యడ్లపల్లి తుక్కియ్య, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు పెట్టా కష్ణ, నాగరాజు బూత్ కన్వీనర్లు పి.వెంకటేశ్వరరావు, కె. దుర్గారావు, ఎం.శ్రీను, పి.కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** గ్రామంలో గురువారం గ్రామ టిడిపి అధ్యక్షుడు నామాల బొజ్జియ్య అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. **ఆలమూరు** . మండలంలోని చెముడులంకలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ', రచ్చబండ కార్యక్రమాలు గురువారం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **అమలాపురం** అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం గోడితిప్పలో అమలాపురం నియోజక వర్గ టిడిపి ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యం లో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారంటీ"కార్యక్రమం రచ్చబండ సమావేశం జరిగినది. కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు దెంతులూరి సత్తిబాబురాజు, క్లస్టర్ ఇంచార్జ్ కడలి వెంకటేశ్వ రరావు, యూనిట్ ఇంచార్జ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి


ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయుల కషి చేయాలని డివైఇఒ శ్రీపాద లక్ష్మీ నరసింహ ఫణి సూచించారు. అదేవిధంగా తరగతుల్లో వెనకబడిన సి, డి గ్రేడ్ విద్యార్థులు మీద దష్టి పెట్టాలని ఆయన తెలిపారు. కె.గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో వార్షిక తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు దీంతో పాటుగా హైస్కూల్లో గల రికార్డులను ఆయన పరిశీలించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి రాంబాబు. కేవీపీ సత్యనారాయణ, ఎస్ఆర్‌కె.సత్యనారాయణ, తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలబాలాజీ శాంతి కళ్యాణం

ప్రజాశక్తి-మామిడికుదురు

ఈదరాడ శివాలయంలో ధర్మ ప్రచారంలో భాగముగా గురువారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. ఎంపిపి కుసుమ వనజకుమారి, ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, చిట్టాల సత్తిబాబు, కె.సూరిబాబు, జి.శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు. స్థానికులు పాల్గొన్నారు.




మండపేటలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పృథ్వీ

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-మండపేట

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని వైసిపి యువనేత తోట పథ్విరాజ్ అన్నారు. మండపేట పట్టణం సచివాలయం 2 పరిధిలో ఉన్న ఎస్సి కమ్యూనిటీ హాల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి 8వ వార్డు కౌన్సిలర్ మండపల్లి రవి కుమార్ అధ్యక్షత వహించారు. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తనయుడు తోట పథ్విరాజ్ ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఏ ప్రభుత్వాలు కూడా ఇంతటి పెద్ద ఎత్తున పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. ఈ సచివాలయం పరిధిలో ఉన్న 7, 8 వార్డులకు గాను 2019 నుండి ఇప్పటి వరకు రూ.26 కోట్ల9లక్షల40 వేలతో 8,800 మందికి గాను ఆర్థికాభివద్ధి కి తోడ్పడిన జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండపేట టౌన్ వైసీపీ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సచివాలయ కన్వీనర్లు మండపల్లి సుధాకర్ పాల్గొన్నారు. **అమలాపురం రూరల్** ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం ఈదరపల్లి సచివాలయం-1లో గ్రామ సర్పంచ్ రాయుడు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మా నమ్మకం నువ్వే జగనన్న లబ్దిదారుల ప్రదర్శన బోర్డ్ ను జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మెన్ దంగేటి డోలామణి రుద్ర, ఇఒపిఆర్‌డి జి. మల్లిఖార్జునరావు, మండల శాఖ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి , అడపా బాబులు, ఊటాల ఉదయ్,కార్యదర్శి కోడూరి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన పోటీలు



కపిలేశ్వరపురంలో వ్యాసరచనపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో వాస్యరచన పోటీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యాయి. గురువారం గ్రంథాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు. గ్రంధాలయోధ్యమానికి త్రిమూర్తులు అయ్యంకి, పాతూరి, రంగనాథన్ ల కషి అద్వితీయం **అమలాపురం** గ్రంథాలయోద్యమానికి విశేష కషిచేసిన గ్రంథాలయోధ్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు పాత్ర ఎనలేనిదని ప్రముఖ కవి, రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి అన్నారు. స్థానిక ప్రధమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి పోలిశెట్టి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కొల్లూరి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, మానవతా విలువలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ గ్రంధి నరసింహ మూర్తి, రిటైర్డ్ లైబ్రేరియన్ విబికె.సుబ్రహ్మణ్యం, టీచరు దుర్గా భవానీ , ఆకుల నారాయణ రావు విద్యార్థులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** పట్టణంలో గల గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు రెండు వందల మంది విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీలకు హాజరయ్యారు. లైబ్రేరియన్ దడాల వెంకటరమణ మాట్లాడుతూ వ్యాస రచన పట్ల విద్యార్థులకు అవగాహన కలిగించామన్నారు. విజేతలకు గ్రంథాలయ ముగింపు ఉత్సవాల్లో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. అసిస్టెంట్ లైబ్రరీయన్ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** గ్రంథాలయంలో గ్రంథాలయం -ప్రయోజనాలు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకుడు సూర్యనారాయణ తెలిపారు. సానిక హైస్కూల్ విద్యార్థులు పాలుగున్నారు. కార్యక్రమంలో యరుబండి కన్నబాబు, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **అమలాపురం(అల్లవరం)** గోడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయఅధికారి పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గోడి ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్.రంగనాథన్, పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం గోడి జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయులు ఎస్.సునీత దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి డి. శివకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ ,విభాగంలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో విద్యార్థుల్లో పుస్తక పఠనం ప్రాముఖ్యత, సీనియర్స్ విభాగంలో జల సంరక్షణ ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, సచివాలయ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రముఖులకు నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషు కుమార్ ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలలో ఎంఇఒ సత్తి సత్య కష్ణ, కవి శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, రిటైర్డ్ పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** గ్రంథాలయం లో గ్రంథ పాలకురాలు కుంచే సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎంఇఒ ఎం.హరి ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.రఘు ప్రియ, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ కాండ్రేగులు గంగరాజు, క్రాఫ్ట్ టీచర్ కొల్లి విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పురాతన నాణేలు, స్టాంపుల ప్రదర్శన

ఆత్రేయపురం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా ప్రతిభా పురస్కార గ్రహీత అల్లు రామ కష్ణ పురాతన నాణేలు, కరెన్సీ మరియు స్టాంపులు ప్రదర్శించారు. మండల ఇఒపిఆర్‌డి డి.శ్రీనివాస్ ప్రారంభించినారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాఠకులు ఉపాధ్యాయులు . గ్రంథాలయ అధికారి టి.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యాపారి మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి నరాలసెట్టి చక్రధర్ (52) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీ మాండవ్య నారాయణస్వామి ఆలయ సమీపంలో నరాలశెట్టి చక్రధర్ కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. రెండు రోజులు క్రితం పురుగుల మందు తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మామిళ్లదొడ్డి వంతెన సమీపంలో ప్రయాణికులతో కాకినాడ వెళుతున్న ఆటోను కాకినాడ నుంచి పెద్దాపురం వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును హైడ్రా సాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

నలుగురిపై సారా కేసులు నమోదు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించి సారాను విక్రయిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. 1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడారు. గెద్దనాపల్లిలో 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామంలో 20 లీటర్ల నాటు సారా, గోకవరంలో 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వసం చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

దొమ్మేరులో ఉద్రిక్తత

- హోం మంత్రి వనితకు చుక్కెదురు
- దళిత యువకుడు మహేంద్ర అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- కొవ్వూరు, రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫ్లెక్సీ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న బొంతా మహేంద్ర(21) అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. మహేంద్ర మృతికి అధికార పార్టీలో వర్గ విభేధాలే కారణమని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్థానిక ఎంఎల్‌ఎ, హోం మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునలను పరామర్శకు పంపించింది. ఈ నేపథ్యంలో దొమ్మేరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన హోం మంత్రి తానేటి వనితను స్థానికులు కారు దిగనివ్వలేదు. పోలీసుల సహకారంతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ మాత్రమే కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రుల రాక నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఒక దశలో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టి మహేంద్ర ఇంటి వద్దకు అతికష్టం మీద తీసుకెళ్లారు. పరామర్శించిన అనంతరం ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి మేరుగ నాగార్జున రూ.10 లక్షలు చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. హోం మంత్రి తానేటి వనిత విజయం కోసం మహేంద్ర పనిచేశాడని, పోలీసులు నిర్బంధించారంటే కనీసం పట్టించుకోలేదని, ఆమె దృష్టికి తీసుకెళ్లినా ఒక్క ఫోన్ కూడా చేయలేదని కుటుంబ సభ్యులు మంత్రుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికల్లో తానేటి వనతి ఎలా గెలుస్తారో చూస్తామంటూ హెచ్చరించారు. తన చావుకు కారణం కొవ్వూరు స్టేషన్ ఎస్ఐ భూషణం, వైసిపి నాయకులు నాగరాజు, సతీష్ కారణమంటూ మృతుని వాంగ్మూలం దొరికినట్లు వార్తలు విన్పించాయి.

సిపిఎం నాయకుడు జువ్వల రాంబాబు గృహ నిర్బంధం

దొమ్మేరు ఘటనల నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసుల వేధింపులు తాళలేక దొమ్మేరులో బొంతా మహేంద్ర అనే దళిత యువకుడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మహేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం మంత్రులు దొమ్మేరు గ్రామానికి చేరుకున్నారు. మంత్రుల రాక నేపథ్యంలో జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

గృహనిర్బంధం అక్రమం : సిపిఎం

దొమ్మేరు ఘటన నేపపథ్యంలో మంత్రులు వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల తీరును ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు.


మృతుని తల్లికి చెక్కును అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున


గృహనిర్బంధంలో ఉన్న జువ్వల రాంబాబు

రసాబాసగా టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

వేదికపైనే నాయకుల మధ్య తోపులాట

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం జడ్.రాగంపేట శివారున గురువారం పరిణయ ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన పార్టీల మధ్య జరిగిన ఆత్మీయ సమావేశం రసాబాసగా మారింది. టిడిపి, జనసేన నాయకులు వేదికపైనే తోపులాటకు దిగడం చర్చనీయాంశమైంది. గోకవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి కాలు విరిగిందని, సమావేశానికి ముందు జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసైనికులు ఫంక్షన్ హాలు గేటు వద్ద బైటాయించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి జ్యోతుల నెహ్రూ వచ్చి సమాధానం చెప్పాలంటూ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న జ్యోతుల నెహ్రూ పాటంశెట్టి వద్దకు వెళ్లి మాట్లాడారు. సమస్యలుంటే సమావేశం అనంతరం కూర్చుని సామరస్యంగా చర్చించుకుందామని తెలిపారు. లోపలికి రమ్మని ఆహ్వానించారు. నెహ్రూ ఎంత చెప్పినా వినక పోవడంతో ఆయన సమావేశానికి వెళ్లారు. జనసేన నాయకులు తుమ్మల బాబు సమావేశానికి వచ్చి సూర్యచంద్రకు, జనసైనికులకు సర్ధి చెప్పి సమావేశానికి తీసుకెళ్లారు. వేదికపైకి వెళ్లాగానే సూర్యచంద్ర ఘర్షణ విషయాన్ని ప్రస్తావించారు. బాధితులకు క్షమాపణ చెప్పాలని నెహ్రూపై ఒత్తిడి తెచ్చారు. ఈ సమయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, సూర్యచంద్ర మధ్య తోపులాట జరిగింది.



వేదికపై టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల తోపులాట

సూర్యచంద్రకు టిక్కెట్ ఇస్తే సహకరించేది లేదు : నెహ్రూ

ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట ఎంఎల్‌ఎ టిక్కెట్ పాటంశెట్టి సూర్యచంద్రకి ఇస్తే తాను సహకరించబోనని స్పష్టం చేశారు. సాధారణ జనసేన కార్యకర్తకు ఇచ్చినా పని చేస్తానని తెలిపారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలయికతో ఆత్మీయ సమావేశం పెట్టుకున్నామని, కొంత మంది రాజకీయ కక్షలతో సమావేశాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. 45 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏ సమావేశంలోనూ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘర్షణ అనంతరం యధావిధిగా సమావేశం శాంతియుతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల బాబు, వరుపుల తమ్మయ్యబాబు, సూరంపాలెం బాలు, టిడిపి నాయకులు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎస్‌విఎస్.అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహన్ రావు, కొర్పు సాయి తేజ, యర్రంశెట్టి బాబ్జి, కొత్త కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

60 మంది ట్రైనీలకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - యానాం

నిరుద్యోగ యువతకి నేషనల్ అర్బన్ లైవ్ హుడ్ మిషన్ పథకం ద్వారా యానాం మున్సిపల్ కార్యాలయంలో కొరియర్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ కోర్స్‌లో శిక్షణ పొందిన 60 మందికి కిట్లను ఆర్ఎఒ మునిస్వామి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, ఎసిఒ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీభాయి జయంతి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిక్రియా నగర్ హై స్కూల్ రోడ్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర యానాం శాఖను పరిపాలనాధికారి మునిస్వామి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సర్వీస్ ఇచ్చి ఖాతాదారుల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ 41వ శాఖ యానాంలో ప్రారంభించామని తెలిపారు. ప్రజలు తమ బ్యాంకును ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వివిఎస్.రామ్‌మోహన్ పరిపాలనాధికారి మునిస్వామిని దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఈలప్రోలు విష్ణువర్ధన్ రావు, యానాం వర్తక సంఘం ప్రతినిధులు మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లాడి శామ్యూల్, యానాం కాపు సంఘం ప్రెసిడెంట్ కాటంశెట్టి వెంకట రామ్మూర్తి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సత్యలక్ష్మికి మెడికల్ సీట్ కేటాయించాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి - యానాం

ఇడబ్ల్యుఎస్‌లో కోన జయసత్యలక్ష్మికి మెడికల్ సీటు కేటాయించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మెడికల్ సీటు పొందాల్సి ఉండగా ఆ సీటును మేనేజ్‌మెంట్ కోటాలో మరొకరికి కేటాయించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేసి జయ సత్యలక్ష్మికి కచ్చితంగా 10 శాతం ఇడబ్ల్యూఎస్ కోటాను అమలు చేసి సీటు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

అంబాజీపేటలో కార్డియాలజీ సేవలు

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట వాసవి కాంప్లెక్స్ ఎదురుగా ఉషా క్లినిక్, డయాబెటిక్, జనరల్ వైద్య నిపుణులు, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రతినెలా మొదటి గురువారం, మూడవ గురువారం అందుబాటులో ఉంటారన్నారు. గుండె వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుకిరువైపులా వాహనాల నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండపేట నుంచి ఏడిద మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా లారీలను నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు మార్గంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తదితర సరుకులను ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాల్లో తీసుకొస్తుంటారు. మిల్లులో సరుకు దిగుమతి చేసే వరకు వాహనాలను రోడ్డు చెంతనే నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మార్గం ఇరుకుగా మారడంతో పాటు రోడ్డు అంతా గోతులు మయంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చొప్పెల్ల ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పశువైద్యాశాలను పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యుల పనితీరుపై రైతులను అడిగి ఆరా తీశారు. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆమె వెంట వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు కె.భానుప్రసాద్, తిరుమలరాజు ఉన్నారు.


టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం

రాష్ట్ర క్షేమం కోసమే కలయిక

ప్రజాశక్తి-కొత్తపేట


జగన్ రాక్షస పాలన అంతమొందించి రాష్ట్ర ప్రజల క్షేమం కోసమే టిడిపి, జనసేన పార్టీలు ఏకమయ్యాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బండారు బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణమండపంలో టిడిపి, జనసేనపార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు చాలా నష్టపోయారని, వారి ఆదుకోవడం కోసం, వైసిపి నాయకుల అక్రమాలు, అవినీతిని అడ్డుకునేందుకు టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోరాటం చేయాలన్నారు. జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ మాట్లడతూ ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ఎలాంటి పొరత్యాలు రాకుండా ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలోవాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకష్ణ, శోడిశెట్టి చంద్రశేఖర్, తాళ్ల డేవిడ్ లలో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జనగణనతో పాటూ కులగణన

మంత్రి వేణు గోపాలకృష్ణ

ప్రజాశక్తి - అమలాపురం

జన గణన మాదిరిగానే కుల గణన కూడా పదేళ్లకోశారి జరగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ కులగణనకు శ్రీకారం చుట్టారని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,600 పైచిలుకు వరకు కులాలు, ఉప కులాలు ఉన్నాయన్నారు. కులాల ఆకాంక్ష మేరకు వారికి ప్రాతినిధ్యం ఎలా ఉన్నది అనేది తెలుసుకునేందుకు కులగణనను చేపట్టామన్నారు. 1951 నుంచి జనగణన మాత్రమే జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు తప్ప మిగిలిన కులాల గణన జరగలేదని ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా కుల గణన ప్రస్తావన వచ్చిందన్నారు. ఈ గణన కోసం బిసి, ఎస్‌సి, మైనారిటీ, ఎస్‌టి ముఖ్య కార్యదర్శులతో కమిటీని నియమించారన్నారు. ఇటీవల పైలెట్ ప్రాజెక్టు మూడు గ్రామ వార్డులు రెండు వార్డు సచివాలయాల్లో నిర్వహించి ప్రక్రియను నిశితంగా పరిశీలించారన్నారు. ఈ సర్వే ఆధారంగా ఆయా కులాల అభ్యున్నతికి జనాభా ప్రాతిపదికన సంఘ నాయకుల సూచనలను పరిగణనలో తీసుకుంటా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియకు సంబంధించి ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుల్లో అభిప్రా యాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో జెసి కులగణన సర్వేకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో వాలంటీర్ యాప్‌లో 20 అంశాల ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో నింపి అందిస్తామన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

నేను లోకల్... నాకు ఓటేయ్యండి

రాజోలు ఎంఎల్‌ఎ రాపాక వరప్రసాద్

ప్రజాశక్తి-రాజోలు

స్థానికుడు అయిన తకు ఓటు వేస్తే నిత్యం ప్రజల్లో తిరుగుతూ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని, వలస నాయకులను గెలిపిస్తే గెలిచిన తర్వాత కంటికి కనపడరని సంచలన వాఖ్యలు చేశారు. రాజోలు ఎల్ఐసి రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. వారాహి యాత్రలో భాగంగా రాజోలు గుండా ప్రయాణించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ రోడ్డు దుస్థితిని చూసి 15 రోజుల్లో రోడ్డు వేయక పోతే తానే స్వయంగా వచ్చి శ్రమదానం చేసి రోడ్డు నిర్మిస్తానని సవాల్ విసిరారు. అయినా రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడంతో పలు మార్లు జనసేన నాయకులు రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. ఎట్టకేలకు ఎంఎల్‌ఎ రాపాక చొరవతో రూ.90 లక్షల నిధులతో కనకదుర్గ గుడి నుంచి రాజోలు సెంటర్ వరకు సిసి రోడ్డు, డ్రెయినేజీని నిర్మించారు. ఈ సందర్భగా సర్పంచ్ రేవు జ్యోతి అధ్య క్షతన నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ రాపాక మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపినాయకులు ఎల్ఐసి రోడ్డులో చీపుర్లు పట్టుకుని ఫోటోలకు ఫోజులు ఇచ్చారన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థనూ ఏర్పాటు చేశానని తెలిపారు. అలాగే రూ.80 లక్షలతో పాత ఎమ్‌డి గారి ఆసుపత్రి రోడ్డుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పార్టీలకు, మతాలకు అతీతంగా తనను మరోమారు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు మట్టా శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపిటిసి సభ్యులు చెల్లింగి ఈశ్వరి, కె.పుష్పలత, స్థానిక నాయకులు దార్ల పెదబాబు, కెవిఎస్.రాజు, కంచర్ల శేఖర్, మట్టా ఏడుకొండలు, అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం తానా సెంటర్ వద్ద సుమారు రూ.10 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు ఆరోపించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గోకవరం మీదుగా భద్రాచలం, పాడేరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెన ఎంతగానో అవసరం అన్నారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పాత వంతెన ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాట్మెంట్‌కు సంబంధించిన అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో సరైన ప్రణాళిక కాకుండా స్థానిక అఖిలపక్ష నాయకులను సైతం సంప్రదించకుండా హడావిడిగా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. భూసేకరణ చేయకుండా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణం వల్ల నష్టంపోయిన వారితో సంప్రదింపులు జరిపి వంతెన నిర్మాణానికి ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

పాలంగి ఉపసర్పంచ్ పదవి ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి గ్రామంలో 12వ వార్డు సభ్యుడు వెలివెల వెంకట సీతా రామారావు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇఒపిఆర్‌డి జిడెవి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఇంత వరకు ఉపసర్పంచ్‌గా ఉన్న మేళం రాజకుమారి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహించామన్నారు. 10వార్డు సభ్యుడు బసవ యేసు నాయుడు ప్రతిపాదించగా, 3వార్డు సభ్యుడు కడలి రవికుమార్ బల పరిచారు. దీనితో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రామారావుకు సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డి.హాసన్ జానీ, నాయకులు పాలాటి శరత్ బాబు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి -కరప

స్కూల్ గేమ్స్ ఆటల పోటీలో భాగంగా కర్నూలులో ఈనెల 17 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారని హెచ్ఎం మోహన్ తెలిపారు. అండర్ -14, 17 బాలురు బాలికలు విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. తొలుత సర్పంచ్ శ్రీనివాసరావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటూ ఆటల్లోనూ రాణించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ పబ్బినీడి వీరబాబు, ఎంపిటిసి సభ్యులు వై.వీరవేణి, కాకినాడ రూరల్ జోన్ అధ్యక్షుడు వి.మాచారావు, పిఠాపురం టౌన్ జోన్ అధ్యక్షుడు వి.హరిబాబు, తాళ్లరేవు జోన్ కోశాధికారి ఆర్. దుర్గా ప్రసాద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

బాస్కెట్ బాల్ జట్టుకు ప్రగతి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రగతి హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు మదనపల్లిలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-14 బాస్కెట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రగతి విద్యార్థి సిహెచ్.కిరణ్‌రాజ్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ నూతలపాటి హిమబిందు తెలిపారు. ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ హిమబిందు, చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు, ఎజిఎం ఎస్.అనిల్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ఆర్.సత్యనారాయణ విదార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.సురేష్, పిఇటిలు జి.సూరిబాబు, సూర్యకుమారి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు

'వైసిపితోనే సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా అన్నారు. గురువారం మునికూడలి, రాజంపేట గ్రామాల్లో గడప గడపకఊ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. ప్రజా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీను, కో-కన్వీనర్ కరటూరి హరిబాబు, సేవా దళ్ అధ్యక్షులు డాక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి ఇఒ ఆజాద్ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానం ఇఒ ఎస్.చంద్రశేఖర్‌ఆజాద్ ఆకస్మికంగా బదిలీ కావడంపై పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం మార్చిలో ఆజాద్ దేవస్థానం ఇఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆనతికాలంలోనే దేవస్థానంలో తన దైన శైలిలో అనేక చర్యలు తీసుకున్నారు ముఖ్యంగా స్వామివారి వైదికపరంగా చేయాల్సిన కార్యక్రమాల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు గుర్తించే విధంగా నిర్వహించారు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 67 అభివృద్ధి పనులు చేపట్టారు. ఉద్యోగులందరూ బాధ్యతగా మెలిగెల క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. కీలక విభాగాల్లో దోపిడీకి అడ్డుకట్ట వేశారు. ఇది సహించని వారు ఆజాద్‌ను బదిలీ చేయాలని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఆయన వచ్చిన ఆరు నెలలకే బదిలీ చేయించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆజాద్ ప్రస్తుతం శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ అయ్యారు